క్లుప్తంగా

డాక్టర్ సుధాకరరెడ్డికి నివాళి

భీమునిపట్నం: ప్రముఖ డాక్టర్ దాడిరెడ్డి సుధాకరరెడ్డి ఆదివారం సాయంత్రం కన్నుమూయగా, సోమవారం ఆయన పార్థివదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ నియోజకర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు నివాళులర్పించారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

ఆనందపురం : మండలంలోని కుసులువాడలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జోన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. విశాఖ కంటి ఆస్పత్రి సౌజన్యంతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి ఏర్పాట్లు చేస్తారు. మిగతా వారికి మందులు అందజేస్తారు. పరీక్షలు చేయించుకోవడానికి వచ్చే వారు ఆధార్ కార్డు జెరాక్స్‌ను తప్పనిసరిగా తెచ్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు వినతి

భీమునిపట్నం: భీమిలి మండలంలోని పాత మూలకుద్దు గ్రామానికి ఆనుకుని ఉన్న చిప్పాడ రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ సోమవారం స్పందనలో వార్డు సభ్యులు కొయ్య రమేష్‌రెడ్డి, కొయ్య వెంకటేష్ తదితరులు తహసీల్దార్ కె.వేణుగోపాల్‌కు విన్నవించుకున్నారు. ఇక్కడి సర్వే నంబర్ 28, 29లో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ పూర్తి స్థాయిలో పరిశీలన చేసి అవసరమైన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. అలాగే జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు రెండు వినతులు వచ్చాయి.

స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు



జెడ్సీ కనకమహాలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న లక్ష్మి

మధురవాడ: క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న వుడా అప్రూవుడ్ లే అవుట్లలోని ప్రైవేటు స్థలాల్లోకి ఎంవీవీ సిటీకి చెందిన మురుగునీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గెడ్డ ద్వారా మురుగునీరు తరలింపునకు తక్షణ చర్యలు చేపట్టాలని సీహెచ్.లక్ష్మి తదితరులు కోరారు. ఈ సందర్భంగా మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం జెడ్సీ కె.కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు జోన్‌లోని వివిధ వార్డుల నుంచి పలు సమస్యలపై 10 అర్జీలు వచ్చాయి. జీసీసీ లే అవుట్‌లో మురుగు ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, చర్యలు చేపట్టాలని కాలనీకి చెందిన ఎ.లావణ్యకుమారి ఫిర్యాదు చేశారు. బక్కన్నపాలెం గ్రామంలో భూలోకమాంబ గుడి వెనుక కాలనీకి కరెంటు స్తంభాలు, రోడ్లు, కాల్వలు ఏర్పాటు చేయాలని జె.శ్రీనివాస్, తదితరులు కోరారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ చెప్పారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించారని ఫిర్యాదు

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో సర్వే నంబర్ 256లోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఈ గ్రామ సర్పంచ్ భర్త గొర్రిపాటి పెద ఎర్రినాయుడు ఆక్రమించారని గ్రామస్తులు సీహెచ్.సూర్యనారాయణ, జి.చంద్రరావుతోపాటు పలువురు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. పేదలకు చెందాల్సిన భూమిని బినామీల పేరున ఆక్రమించారని ఆరోపించారు. గంధవరం రెవెన్యూ పరిధిలోని కొవ్వాడ నుంచి అలమండ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న టేకు చెట్లను జి.పెద ఎర్రినాయుడు కట్ చేసి ట్రాక్టర్‌తో తోలుకుపోయాడని పిల్లి సూర్యనారాయణ కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని ఆ ఫిర్యాదులో తెలిపారు.

జోరు వానతో రోడ్లపై వరద నీరు



గుడ్లవానిపాలెం రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద వర్షం నీటితో చెరువును తలపిస్తున్న రోడ్డు

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం జోరు వాన కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు చుర్రుమనిపించే ఎండకాసినా తర్వాత వాతావరణం చల్లబడి సాయంత్రం జోరువాన కురిసింది. ఈ వర్షంతో నగర ప్రజలు సేద తీరారు. జోరు వర్షానికి మధురవాడ అప్ బ్రిడ్జి, డైలీ మార్కెట్, పీహెచ్‌సీ రోడ్డులో నీరు భారీగా నిలిచిపోయింది. ఆ నీటిలోనే వినియోగదారులు, విద్యార్థులు రాకపోకలు సాగించారు. అన్ని లోతట్టు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

జలమయమైన రోడ్లు

కొమ్మాది: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. సోమవారం కురిసిన భారీ వర్షాలకు గుడ్లవానిపాలెం రహదారి, ఇస్కాన్ రోడ్డు, అంధుల పాఠశాల రోడ్డు, పరదేశిపాలెం గెడ్డపైన వరద నీరు భారీగా ప్రవహించింది. దీంతో సాయంత్రం సుమారు మూడు గంటలపాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

మధ్యాహ్నం వరకు ఉక్కపోత.. ఆపై వర్షం

తగరపువలస: భీమిలి పరిసరాల్లో రోజూ విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ ప్రతాపం చూపిస్తూ ప్రజలను ఉక్కపోతకు గురిచేస్తోంది. అనంతరం విచిత్రంగా మబ్బులు గొడుగు పట్టినట్టి చిమ్మచీకట్లు అలుముకుని వర్షం కురుస్తోంది. ముఖ్యంగా భీమిలి మండలాన్ని ఆనుకుని ఉన్న విజయనగరం జిల్లాలోని భోగాపురం మండలం, భీమిలి శివారు పంచాయతీ తాళ్లవలస వరకు రోజూ కురుస్తున్న వర్షాలు భీమిలి జోన్‌లో మాత్రం ముఖం చాటేస్తున్నాయి. ఒకవేళ కురిసినా నిమిషాల వ్యవధిలోనే ముగించేస్తున్నాయి. దీంతో ఇక్కడ కనిపిస్తున్న విచిత్ర వాతావరణం కారణంగా స్థానికులు విస్తుపోతున్నారు.

వేములవలసను ముంచెత్తిన వరదనీరు

ఆనందపురం : మండలంలోని వేములవలస గ్రామాన్ని వరదనీరు ముంచెత్తింది. దీంతో పలు ఇళ్లల్లోకి నీరు ప్రవేశించడంతో నివాసులు ఇబ్బందులు పడ్డారు. ఆనందపురం జంక్షన్ నుంచి నాలుగు వైపులా రోడ్లు ఉన్నా ఎక్కడా కాలువలు నిర్మించలేదు. వేములవలస పూల మార్కెట్ నుంచి వేములవలస గ్రామం వరకు రోడ్డు చాలా ఏటవాలుగా ఉండడంతో జట్లమ్మ కొండ పైనుంచి వచ్చే వరద నీరు నేరుగా ప్రధాన రహదారి గుండా ప్రవహించి గ్రామంలోకి చేరుకుంటోంది. లోతట్టు ప్రాంతంలోని ఇళ్లల్లోకి నీరు ప్రవేశించడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. వెల్లంకిలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం చుట్టూ నీరు చేరిపోవడంతో అక్కడికి వెళ్లడానికి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఏటా ఇక్కడి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరదనీటి ప్రవాహానికి కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీఎం పాలెం: ఈ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. పీఎంపాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉన్న డ్రెయిన్ పూడుకుపోవడంతో వరద నీరు రోడ్డుపై నిలిచిపోయి చెరువును తలపించింది. ఆ రోడ్డులో రాకపోకలు సాగించిన వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గాయత్రినగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, బాబానగర్ ఆర్ హెచ్ కాలనీల్లోని అంతర రహదారులు జలమయమయ్యాయి. రోడ్డుపై నిలిచిపోయిన నీటిని తొలగించడానికి జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మధురవాడ మార్కెట్ రోడ్డులో వర్షం నీటిలో మహిళలు, విద్యార్థులు



పీఎంపాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన నీరు



వెల్లంకిలోని ఏటీఎం కేంద్రం సమీపంలో వరద నీరు

బహుళ పంటలతో అధిక ఆదాయం



కోరాడలో బొప్పాయి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పద్మనాభం: బహుళ పంటలు సాగు చేయడంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజినల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్ సూచించారు. మండలంలోని కోరాడలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కషాయం, బహుళ పంటల సాగుపై రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వరి పంటతోపాటు గట్లుపై ఎర, రక్షక పంటలు, ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవచ్చని సూచించారు. కషాయాలు తయారీ, వాటి ఉపయోగాలు వివరించారు. వేరుశనగ పంటలో అంతర, సరిహద్దు పంటలు ఏ విధంగా సాగు చేయాలో క్షేత్ర స్థాయిలో చూపించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న బొప్పాయి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి లేని పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం



వాంబేకాలనీలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీ వంటి ఏ రకమైన వివక్ష, అవినీతి లేని నిష్పాక్షిక పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు 65వ నంబరు సచివాలయం పరిధి వాంబేకాలనీ అంబేడ్కర్ విగ్రహం పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా బ్లాకుల్లో గల పలు నివాసాల వద్దకు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వెళ్లారు. అధికారులు, నాయకులతో కలిసి స్థానికుల సమస్యలు, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరిస్తూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏ పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని... ప్రస్తుతం ఫించన్, రేషన్‌తోపాటు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు, పత్రాలు ఇంటి ముంగిటకే వలంటీర్ల ద్వారా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని చెప్పారు. వాంబేకాలనీలో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలకు రూ.4 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంట్ర అప్పన్న, గృహసారథులు రామిరెడ్డి, ఎల్లాజీ, రాజు, కె.మంగ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, ముదుండి రాజేశ్వరి, నాయకులు చేకూరి రజని, పిళ్లా సూరిబాబు, జగ్గుపిల్లి నరేష్, శేషుబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు



ముకుందపురంలో కబ్జాకు గురైన భూమి

ఆనందపురం : మండలంలోని ముకుందపురంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని సోమవారం గ్రామస్తులు స్పందనలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి. ముకుందపురం సర్వే నంబరు 65లో సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంత కొండ పోరంబోకు భూమి కలిసి ఉంది. ఇక్కడ గతంలో 72 ఎకరాలకు ఎస్సీ, బీసీలకు ప్రభుత్వం డి పట్టాలు అందజేసింది. కాగా ఆ భూములు ఎప్పుడో చేతులు మారిపోయాయి. ఇదిలా ఉండగా పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఆ భూములను ల్యాండ్ పూలింగ్ కింద ప్రభుత్వం తీసుకోవడానికి ఏర్పాట్లు చేస్తోంది. పట్టాలు ఉన్నవారికే కాకుండా కొనుగోలుదారులకు కూడా ప్రభుత్వం స్థలాల రూపంలో పరిహారం ఇవ్వడానికి నిర్ణయించింది. అలాగే డి పట్టా భూములు గల వారికి శాశ్వత హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అక్కడి భూములకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఈ మేరకు అక్కడ ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కొంత మంది స్థానికులు యంత్రాలతో చదును చేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే 10 ఎకరాల వరకూ ఆక్రమణకు గురైనట్టు గ్రామస్తులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విచారణకు ఆదేశించిన తహసీల్దార్ ఎల్.రామారావు మాట్లాడుతూ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని, ఆక్రమణ నిజమేనని ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

300 మంది కళాకారులతో నేడు ప్రదర్శన



కళాబృందాల పోస్టర్ విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

తగరపువలస: నవ చైతన్య కళానాట్యమండలి 19వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో 300 మంది కళాకారులతో ప్రదర్శనలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి సోమవారం మండలి ఆహ్వాన సంఘం పోస్టర్లు, కరపత్రాలను గాంధీ బొమ్మ వీధిలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓ గంట పాటు బంగ్లామెట్ట శివాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు కళాకారులతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. తర్వాత 4 గంటల నుంచి 9 వరకు కల్యాణ మండపంలో జానపద నృత్యాలు, క్లాసికల్ డ్యాన్సులు, రేలారే రేల పాటలు, ఫోక్ డ్యాన్సుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. వీటిని భీమిలి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రతినిధి సరగడ చినరెడ్డి, అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడు తమ్మిన రామలక్ష్మణరావు, ఆర్గనైజర్ బైపిల్లి సూర్యనారాయణ, సహాయ కార్యదర్శులు కోసూరి రాంబాబు, నీలకంఠం, కోశాధికారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మూడు కార్లు ధ్వంసం

పీఎం పాలెం: ఎండాడ ట్రాఫిక్ కూడలి వద్ద సోమవారం ఆగి ఉన్న కారును ఓ ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆనందపురం వైపు నుంచి జాతీయ రహదారిపై వస్తున్న కారు ఎండాడ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చే సరికి స్లోగా ఆగింది. అదే రోడ్డులో వెనుక వస్తున్న ప్రైవేటు బస్సు ఆ కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఈ ఘటనలో ఆ కారు ఢీకొని మరో రెండు కార్లకు కూడా డ్యామేజ్ అయింది. ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు.

జగనన్న కాలనీ ఇళ్ల రుణాలకు బ్యాంక్ అకౌంట్‌లు



చంద్రంపాలెం వార్డు సచివాలయంలో బ్యాంకు అకౌంట్‌లు తెరుస్తున్న సిబ్బంది

మధురవాడ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు చేపడుతోంది. జియో ట్యాగింగ్ పనులు పూర్తయిన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు అకౌంట్‌లు తెరిపించే పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం చంద్రంపాలెం వార్డు సచివాలయంలో లబ్ధిదారులతో బ్యాంకు అకౌంట్‌లు తెరిపించే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు బ్యాంకు ఖాతాలు తెరుచుకున్నారు. హౌసింగ్ శాఖ ప్రతినిధి వెంకటరమణ ఆధ్వర్యంలో ఐసీఐసీఐ బ్యాంకు ప్రతినిధులు సాయికృష్ణ తదితరులు అకౌంట్‌లు తెరిచారు. మంగళవారం పీఎంపాలెం అవంతి ఫంక్షన్ హాలులో ఉన్న వార్డు సచివాలయంలో అకౌంట్‌లు తెరుస్తామని వారు చెప్పారు. జియో ట్యాగింగ్ పూర్తయి, వలంటీర్ల సమాచారం ఇచ్చిన లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు, ఆరవైఅగ్రహారంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ వార్డులో మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ప్రతి ప్రాంతంలోనూ డ్రైనేజీలు, సీసీరోడ్లు నిర్మిస్తామని, వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తామని, తాగునీరు పుష్కలంగా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌జీకే కాలనీలో పార్కు పనుల్లో పురోగతి



మారికవలస ఆర్‌జీకే కాలనీ వాసులతో హనుమంతురావు

మధురవాడ: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విడుదలైన నిధులతో జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో పార్కు నిర్మిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు చెప్పారు. ఈ పనుల్లో పురోగతిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ మేరకు సోమవారం కాలనీలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పార్కు పురోగతిపై కాంట్రాక్టర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాయత్రి, సీత, కావ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు



తగరపువలసలోని వైన్‌షాపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న భీమిలి పోలీసులు

తగరపువలస: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని భీమిలి సీఐ డి.రమేష్ హెచ్చరించారు. ఈ మేరకు తగరపువలసలోని అన్ని మద్యం దుకాణాల వద్ద సోమవారం సాయంత్రం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

వ్యసనాలతో భవిష్యత్ సర్వనాశనం

పీఎం పాలెం: బంగారు భవిష్యత్‌ను నాశనం చేసే చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ముక్త్ భారత్ అభియాన్ సహాయ సంచాలకులు జి.మాధవి సూచించారు. సాంకేతిక విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, శ్రీనివాసరావు కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో 'డ్రగ్ డి అడిక్షన్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలేజీ విద్యార్థి దశలో మాదక ద్రవ్యాలు, పొగ తాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు లోనైతే జీవితం సర్వనాశనం అవుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల జోలికి పోరాదని హితవుపలికారు. తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని చక్కగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ ఆల్వార్ దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుభట్, ఏవో నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సి.అనిల్ పాల్గొన్నారు.

మారుపేరు కార్మికుల సమస్యలపై ఫిర్యాదు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో మారుపేర్లు కలిగిన కార్మికుల సమస్యలపై అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ కార్మిక సంఘం, చిట్టివలస లేబర్ యూనియన్ నాయకులు కార్మికుల తరపున ఇందులో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 2009 ఏప్రిల్ 20న మిల్లుకు లాకౌట్ విధించిన యాజమాన్యం తర్వాత పూర్తిగా మూసివేసిందన్నారు. కార్మికులకు అంచెలంచెలుగా పీఎఫ్ చెల్లించినా మారుపేర్లు కలిగిన కార్మికులకు ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదన్నారు. దీంతో వారి కష్టార్జితం పీఎఫ్ ట్రస్ట్ బోర్డులో ఉండిపోయిందన్నారు. మిల్లు మూతపడిన తర్వాత మారుపేరు కార్మికులకు కూడా అదే పేరుతో నోటరీల ద్వారా యాజమాన్యం గ్రాట్యుటీ, నష్టపరిహారం చెల్లించిందన్నారు. పీఎఫ్ చెల్లింపుల విషయంలో ఆధార్‌లో ఒకపేరు, మిల్లులో మారుపేరు ఉండడంతో చెల్లింపుల సమస్య జఠిలంగా మారిందన్నారు. ప్రభుత్వం మాత్రమే గజిట్ నోటిఫికేషన్ ద్వారా పీఎఫ్ ట్రస్ట్ బోర్డుకు తెలిపి కార్మికులకు న్యాయం చేయగలదన్నారు. కార్యక్రమంలో కొండపు ఈశ్వరరావు, దల్లి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలగక ఇబ్బందులు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ మిథిలాపురి వుడా కాలనీలో కొంత కాలంగా వీధిదీపాలు వెలగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు స్థానిక సచివాలయం, జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని సుబ్బారావు అనే వ్యక్తి వాపోయాడు. ముఖ్యంగా పీఎం పాలెం పాత పోలీస్ స్టేషన్ వెనుక 646/ఎ1/2 నంబరు గల స్తంభం వీధి దీపం వెలగక పోవడంతో ఈ ప్రాంతంలో దొంగతనాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెంకటరావు

కొమ్మాది: రుషికొండలో గల గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సు, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ ఛాలెంజర్స్ అండ్ టెండర్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. 5 రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కె.వెంకటరావు ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి, కార్యదర్శి ప్రొఫెసర్ పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.